# 'హమ్మయ్య-బ్రతికించేరు!

## శంకరమంచి పార్థసారధి




* * * * * * *

భూపతిరావు వచ్చేసరికి నేనింకా నిద్రమంచం మీదనే వున్నా. నీరెండ చల్లగాలితో కలిసి జోకొడుతున్నట్లున్నందువల్ల ఒక పట్టాన లేవబుద్ధి కాలేదు. అంతలో ఆ రోజు ఆఫీసుకి సెలవు కూడాను. అంచేత కూడా బద్ధకం రెండింతలయింది. కాని భూపతిరావు వచ్చేక లేవక తప్పిందికాదు.

* * * * * * *

భూపతిరావు అదే వీధిలో నాలుగిళ్ళ అవతల వుంటాడు. అతడికి వుద్యోగం సద్యోగంలాంటి వేవి లేవుగాని, అంతకుమించిన రాబడే వుంది. ఇల్లు సొంతది. అద్దెలక్కొడా ఇచ్చాడు. నెల తిరిగేసరికి సుమారు రెండువేలదాక అద్దె రూపంకంగా వచ్చి పడతాయ్. ఇవిగాక, పొలాలు, మామిడి తోటలు కూడా వున్నాయి. ఇవన్నీ వున్నట్లు చెప్పకుంటాడు గాని, వాటిపైన వచ్చే ఆదాయం మాత్రం ఎవ్వరికి చెప్పడు. చివరికి నాక్కూడా. నాక్కూడాని ఎందుకన్నానంటే అతడు ఆస్థి వివరాలు తప్పించి మిగతా విషయాలు, కష్టసుఖాలు నావొక్కడికీ చెప్పకుంటాడు. ఆ విషయం అతడు చెప్పకోవడమే కాకుండా నే గమనించా కూడా. ప్రతి చిన్న విషయానికీ పరిగెట్టుకొస్తాడు. 'మా సన్నాసి (వాళ్ళబ్బాయి) బొత్తిగా చదవటం లేదండి. ఏం చెయ్యమంటారు?' అనో, లేక 'మా అమ్మాయి ఆఫీసరు వెధవని కట్టుకుంటానంటోంది. వాడికి ఆ డిగ్రీ తప్ప వెనకా ముందు, ఏవీలేవు. నెత్తినైనా జుట్టు కూడా సరిగా లేదు వెధవకి— మా కులంకూడా కాదాయే— ఏం చెయ్యమంటారు?' అనో చెప్పి సలహా అడుగుతుంటాడు. ఇప్పుడిప్పుడు కాస్త సంపద గురించి కూడా చెప్పటం ప్రారంభించాడు. ' మా ఆవిడతో పెద్ద చిక్కొచ్చిపడిందండి. రాళ్ళ గాజులు, రవ్వల దుద్దులు చేయించుకుంటానని ఒకటే గోల. ఇప్పటికే బోల్డంత బంగారం వుంది. వాటిని కాపలా కాయలేక నా ప్రాణం పోతోంది. రోజులెలావున్నాయి మీకు తెల్సుగా ఇంకా బంగారం గని కొంపలో




పెట్టడం ఎంత ప్రమాదం? చెబితే అర్థమయి చావదు—ఛీ...ఛీ...'

అతడు అన్ని విషయాలు కేవలం నాకే చెప్పకోటానిక్కారణం—. అతడు చెప్పేవన్నీ ఓపిగ్గా వినే సహనం కావచ్చు. నేనిచ్చే సలహాపట్ల నిజాయితీ కావచ్చు. ఇంకెవరికీ చెప్పనన్న నమ్మకం కావచ్చు.

ఆ రోజు పొద్దున్నే వచ్చిన అతడ్ని చూడంగానే మళ్ళీ ఏదో సమస్య వచ్చి పడింది అందుకే వచ్చుంటాడనిపించింది. రావటంతోటే ప్రక్కన వున్న కుర్చీని మంచం ప్రక్కగా లాక్కుని కూర్చున్నాడు. మొహంలో ఆందోళన, భయం స్పష్టంగా కనిపిస్తున్నాయి. విచిత్రంగా మాట్లాడకుండా వెంట తెచ్చుకున్న న్యూస్ పేపర్ని తెరచి చదవటం మొదలుపెట్టాడు.

అతడ్ని అలానే వదిలి, కాలకృత్యాలు తీర్చుకోవటానికని లోనికివెళ్ళిపోయాను. అతడికేదో సమస్య వున్నమాట వాస్తవం కాకపోతే ఆ విషయాన్ని నాకు చెప్పాలా వద్దాని నిర్ణయించుకోనుండడని అంచనా కట్టి నేలోపలికి తప్పుకున్నాను. మొహం కడిగి, స్నానం కూడా పూర్తిచేసి అర్థగంట తర్వాత రెండు కాఫీ కప్పులతో తిరిగి ఆ గదిలోకొచ్చాను.

భూపతిరావు అర్థగంట క్రితం ఎక్కడున్నాడో సరిగ్గా అక్కడే వున్నాడు. ఎలా కూర్చున్నాడో అలాగే కూర్చున్నాడు. కాకపోతే తనవెంట తెచ్చుకున్న తెలుగు పేపర్ కాకుండా, నా ఇంగ్లీషు పేపరు కూడా చదవటం పూర్తి చేశాడు. పేపరు పఠనంలో కూడా అతడిలో ఒక ప్రత్యేకతని గమనించాను.

'యువతి ఆత్మహత్య', 'బస్సు చార్జీలు పెంపు', 'మంత్రివర్గం పతనం', 'తెలుగంగ గందరగోళం', అకాడమీల విలీనం', 'విమాన ప్రమాదాలు', 'మానభంగాలు'— ఇటువంటి వార్తలని శీర్షికలు మాత్రం చదివి దృష్టిని త్రిప్పేస్తాడు.

అతడి నాకర్షించే వార్తలు వేరే వున్నాయి—

'కరీంనగర్ అడవుల్లో పోలీసు ఎదురు కాల్పులు. పదిమంది దుర్మరణం, విజయనగరం జిల్లా ఫలానా గ్రామంలో నక్సలైట్ల దాడి, భూస్వామి హత్య, నగరంలో దొంగతనాలు' ఇటువంటి వార్తలు అతడు జాగ్రత్తగా చదవటం, చదివేక భయం భయంగా చూడటం గమనించాను.

కాఫీ కప్పులతో గదిలోకొచ్చి నాకంటికి అతడు అటువంటి వార్తలే చదివి నట్టుగా భయంగా, బేలగా కనిపించాడు. ఒక కప్పని అతడికందిస్తూ నేనూ ప్రక్కనే మంచంపై కూలబడ్డాను.

అతడు నేనందించిన కప్పనందుకుని కాఫీ చప్పరిస్తూ ఇంటి కప్పవంక సాలోచనగా చూస్తున్నాడు. కాఫీ కప్పు చేత్తో పుచ్చుకుని, ఇంటి కప్పవంక చూస్తున్నాడంటే విషయం సామాన్యమైంది కాదని అర్థం చేసుకోగలిగాను. అంచేత నేనే సంభాషణ ప్రారంభించాను

'ఏమిటోయ్— ప్రొద్దునే వచ్చావ్ ఏదైనా పనిమీదగాని వచ్చావా?'

అంటూ అతడు చూపుని పైకప్పు నుంచి నాపైకి త్రిప్పి, నాకేసి కాసేపు అదోలా చూసి, 'రాత్రి వాసూ వచ్చాడటగా నిజమేనా?' అనిడిగాడు.

అప్పటికిగాని ఆయన మౌనానికి, భయానికి కారణం అర్థమైందికాదు. వాసు అంటే ఒకప్పటి నా కొలీగ్— పూర్తిపేరు వాసుదేవరావ్. మొదట్నించి మా యూనియన్ కార్యకలాపాల్లో చాలా వుత్సాహం చూపేవాడు. చిన్న చిన్న పదవులు కూడా నిర్వహించాడు. తరచు మా ఇంటికొస్తుండేవాడు. అప్పుడే భూపతిరావు క్కూడా పరిచయమయ్యాడు. ముగ్గురం కల్సి చాలా సాయంత్రాలు ఖర్చుచేశాం. నేనూ, వాసూ కాఫీలు, సిగరెట్లు వూదేస్తూ మాట్లాడుతుంటే, భూపతిరావు నశ్యం డబ్బాని ఖాళీ చేసేవాడు. నిజానికి మా ముగ్గురిలో వాసూనే ఎక్కువ మాట్లాడే వాడు. రాబోయే విప్లవకాలం గురించి,ఆ విప్లవంసాధించిన దేశాల గురించి, అక్కడి మనుషుల జీవిత స్థితిగతుల గురించి తాను ఏవి పుస్తకాలు చదివింది, ఎవరెవర్ని కల్సుకుంది, మొదలైనవన్నీ చెప్పి, చివరికి ఆఫీసులో శలవు మంజూరు చెయ్యని ఆఫీసర్లని బూతులు తిట్టి వెళ్ళిపోయేవాడు.

భూపతిరావు అతడు మాట్లాడుతున్నంతసేపు నావంక భయం భయంగా చూస్తూ కూర్చునేవాడు. ఎప్పుడన్నా ధైర్యం చేసి ఏదన్నా చెప్పబోతే వాడూ ఆయన మొహంలో మొహం పెట్టి 'విప్లవం వర్ధిల్లాలి—పెట్టి బూర్జువా డౌన్ డౌన్' అంటూ మెడనరాలు వుబ్బేటట్లుగా పెద్దగా అరిచేవాడు. ఆయన దాంతో మరింత బిక్క చచ్చిపోయి, ఒక ప్రక్కన ముడిచిపెట్టుక్కూర్చునేవాడు.

వాసూ వెళ్ళిపోయేక నిష్ఠూరంగా అనేవాడు 'అదేం మనిషండి, అలా మాట్లాడుతాడు? మనిషి సంపాయించుకోవటం, ఆస్తి పాస్తులు అమర్చుకోవటం తప్పేమిటి? మనం ఎవర్ని మోసం చెయ్యటం లేదుగదా? ఆస్తి తాతలు తండ్రుల నించి సంక్రమించి, ఇల్లు కట్టుకున్నాను.నాకంత ఇల్లు అనవసరం కాబట్టి అవ సరం వున్న వాళ్ళకి అద్దెకిచ్చాను. అద్దెల రూపకంగా వాళ్ళేదో ఇస్తున్నారు. కాబట్టి నే పుచ్చుకుంటున్నాను. అలాగే అవసరం కొద్దీ అనేకమంది డబ్బు కావాలని వస్తుంటారు. నోట్లు రాయించుకుని, తాకట్లు పెట్టుకుని వాళ్ళకి సహాయం చేస్తుంటాను— ఇందులో తప్పేమిటో, మోసం, దోపిడీలు ఎక్కడున్నాయో మీరన్నా చెప్పండి.'

'పోన్లెండి అతడి నమ్మకాలు అతడివి—కాదనటానికి మనమెవరం? పోనీ అతడొచ్చినపుడు మీరు రాకండి—అతడే కాస్సేపు కూర్చుని వెడతాడు అనే వాడిని.

కాని, చిత్రంగా వాసూ రాగానే ఎలాకనిపెట్టేవాడో పిలిచినట్లుగా వచ్చి అతడెళ్ళే వరకు కూర్చునేవాడు. వాసూ వెళ్ళేక మళ్ళీ మొదలు దాంతో నాకోవిషయం అర్థమైంది. వాసూ చెప్పేవిషయాలు, ఆయనక్కావాలి, అన్నీవిని నా అభిప్రాయం అడిగేవాడు.''నిజంగా విప్లవం వస్తుందంటావా''అని ఆత్రంగా, భయంగా అడిగే వాడు. ఒక్కోసారి తప్పక వచ్చేస్తుందని ఖండితంగా బల్ల గుద్ది చెప్పేవాడ్ని, ఇంకోసారి 'ఏమీ చెప్పలేం' అని అంటుండేవాడ్ని. ఆయన పైన అమితమైన జాలి పుడితే మాత్రం 'అభయం మీరేం పెట్టుకోకండి. విప్లవం వస్తే రాదీ దేశంలో' అనేవాడ్ని.

ముందుముందు ఏం జరుగనున్నదో ఎవడికి తెల్సుగనక? నా మాటలు గుడ్డిగా నమ్మి ధైర్యంగా వెళ్ళిపోయేవాడు భూపతిరావు.

తర్వాతర్వాత వాసూ మా ఇంటికి రావడం తగ్గించేశాడు. దానిక్కారణం నా పైన విముఖతేం కాదు. అతడికి కార్యక్రమాలు పెరిగినాయి. ఆఫీసుక్కూడా తిన్నగా రావటం మానుకున్నాడు. నెలకి రెండు మూడు సార్లు మాత్రం వచ్చి అలా మొహం చూపించి ఇలా వెళ్ళిపోతుండేవాడు. బయట అతడేదో దళంతో సంబంధాలు ఏర్పరచుకున్నాడని, వాళ్ళ కార్యక్రమాల్లో చాలా వుత్సాహంగా పాల్గొంటున్నాడని వాళ్లు వీళ్ళు చెప్పుకుంటుండగావిన్నాను. ఆ విషయం ఆఫీసు అధికారులు కూడా విన్నారులావుంది. అతడ్ని వుద్యోగంలోంచి డిస్మిస్ చేశారు.

వాసూ అంటే నాకో ప్రత్యేకమైన అభిమానం వుంది. అతడిలోని నిజాయితీ, పట్టుదల, లక్ష్యశుద్ధి నన్నాకట్టుకున్నాయి. తను నమ్మిన సిద్ధాంతం కోసం అతడా విధంగా వుద్యోగాన్ని, జీవితాన్ని, సమాజాన్ని, పెళ్ళాంపిల్లల్ని తృణప్రాయంగా భావించి తను నమ్ముకున్న ప్రపంచంలోకెళ్లటం నాకెంతో గర్వం అనిపించింది. సిద్ధాంత పరంగా మాయిద్దరిది ఒకటే అభిప్రాయం అయినా, నాలో పిరికితనం

వుంది. స్వార్థం వుంది. జీవితంపైన కొండంత ఆశుంది. సిద్ధాంతం కోసం వాదులాడే వాడికి ఇవన్నీ వుండకూడదు. వాసుకి ఇవేవీ పట్టవ్. అందుకే అతడంటే నాకిష్టం.

వాసుని వుద్యోగంలోంచి తీసేసారని, అతడు కనుపించటం కూడా లేదని విని భూపతిరావు మరికాస్త భయపడ్డాడు. 'అయితే, విప్లవం రాక తప్పదులా వుంది. ఏనిటో ఆయనకి ఎందుకొచ్చిన తిప్పలు, హాయిగా పెళ్ళాం పిల్లలతో కాపురం చేసుకోక—లక్షణంగా వుంటావంటే నేను సహాయం చేసేవాడిని....ప్స్... తొందరపడ్డాడు. అవును, నాపైన కోపంగాని లేదుగదా అలా అని ఎప్పుడన్నా మీతో అన్నాడా?'

ఆయన భయానికి కారణం నాకర్థమైంది. ఏ అర్థరాత్రో వచ్చి కొంపని చుట్టు ముడతాడేమోనని అతడి భయం. వాసు అలాంటివాడు కాదు. అతడికి వ్యక్తులు ముఖ్యం కాదు, సిద్ధాంతం. మీకేం పర్వాలేదు, ధైర్యంగా వుండండి' అని సర్ది చెపుతుండేవాడిని.

అప్పట్నుంచి వాసు జాడనాకు తెలీదు. నాకే కాదు అతడి భార్యక్కూడా, తెల్పినప్పుడు. ఆమె వలవలా ఏడ్చేది 'దేశంలో ఎవ్వరికి పట్టని ఈయనకెందుకు చెప్పండి. కట్టుకున్న పెళ్ళాంకన్నా దేశం ఎక్కువా? నేనెలా బతకడం పిల్లల్నెలా పెంచేది?'

అదేమిటో ఆమెని చూస్తే, ఆమె చెప్పేది వింటుంటే ఆ క్షణంలో అది సబబనిపించేది. మనుషులకోసం సిద్ధాంతాలా, సిద్ధాంతాలకోసం మనుషులో అర్థం చేసుకోలేక సతమతమై పోయాను. కొన్నాళ్ళకి ఆమె స్కూల్లో టీచరుగా చేరిందని తెల్సుకుని కాస్త వూరట చెందాను!

వాసు ఇల్లు విడిచి వెళ్ళిపోయాక రెండు మూడు సార్లకి మించి నాకు కనిపించలేదు. ఏ అర్థరాత్రిపూటో, వూరంతా నిద్రపోతుంటే వచ్చేవాడు. ఇద్దరం ఒక గంటసేపు అనేక విషయాలు చర్చించుకునేవాళ్ళం. తన కార్యక్రమాలు గురించి చెప్పేవాడు. తనకోసం పోలీసులు తిరుగుతున్నారనేవాడు. భార్యా పిల్లల గురించి అడిగేవాడు. 'చాలా అవస్థలు పడుతోంది. ఒక్కసారి వెళ్ళి చూసి రాలేకపోయావా?' అని నేననేవాడ్ని. 'వొద్దు—వొద్దు—మనసు చలిస్తుంది. లక్ష్యం దెబ్బ తింటుంది' అనేవాడు తలొంచుకుని. వెళ్ళిపోయేముందు భూపతిరావు ఎలా వున్నాడని అడిగేవాడు. 'విప్లవం కనుచూపు మేరల్లోకి, వూరు పొలిమేరల్లోకి వచ్చేసిందని చెప్పు' అనేసి చీకట్లోకి కల్సిపోయేవాడు.

ఆ విషయం ఆ మర్నాడు భూపతిరావుకి చెప్పేవాడ్ని. అదివిని మరింత గడగడ లాడేవాడు.

దాదాపు ఏడాది తర్వాత రాత్రే తిరిగి వాసూ వచ్చాడు. తలుపు తట్టి ఒక ప్రక్కగా చీకట్లో కల్సిపోయి నిల్చున్నా. గడ్డం బాగా పెంచాడు. కళ్ళు గుంటలు పడ్డాయి. దవడలు లోపలికి తోసుకుపోయినాయి. మొహం బాగా పీక్కుపోయింది. ధరించిన లాల్చీ పైజామా బాగా దుమ్ముకొట్టుకు పోయినాయి. భుజానికి సంచి వ్రేలాడుతోంది.

మనిషి రూపు ఎంతగా మారిపోయిందంటే, తలుపు తీసిన నేను 'ఎవరు కావాలండీ' అని అడిగేటంత.

'నేను—వాసుని' అని అతడన్నాక గాని నా పొరపాటు నాకర్థమైందికాదు.

సాదరంగా లోనికి తీసుకొచ్చి కూర్చో పెట్టాను. 'భోం చేస్తావా—వాసూ' అనడిగాను. అలా అడుగుతుంటే నా కళ్ళల్లో నీళ్ళు తిరిగినాయ్. కాని అతడే మాత్రం చలించకుండా అక్కర్లేదన్నట్టుగా తలూపాడు.

కాస్సేపు ఇద్దరం భయంకరమైన నిశ్శబ్దంలో అపరిచితుల్లాగా వుండిపోయాం. అంత మౌనంగా వుండడం వాసూ స్వభావానికే విరుద్ధమైంది. నిప్పులు కక్కే అతడు అలా నీళ్ళు నమలటం నాకు సహించరాని విషయంగా అన్పించి—

'ఏం వాసూ అలా వున్నావ్— ఒంట్లో కులాసాయేగా' అనడిగాను.

అతడు మెల్లిగా తలెత్తి నావంక దీనంగా చూశాడు. కళ్ళు ఎర్రగానే వున్నాయి గాని, చూపుల్లో మునుపెన్నడూ కనిపించని బేలతనం కనిపిస్తోంది. నిప్పుకి, ఇనుముకి కూడా చెదలు పట్టటం సాధ్యమేమో అనిపిస్తుంది అతడ్ని ఆ క్షణంలో చూస్తే.

'నీతో ముఖ్యమైన పనుండి వచ్చా' అన్నాడు చివరికి మెల్లగా.


# జెమిని పళ్లపొడి వారి సరికొత్త సృష్టి

......భారతదేశంలో ఉన్న పళ్లపొడిలన్నిటికన్న భిన్నమైనది.. ....ప్రప్రథమంగా స్పిరమెంటుఆయిలుతో ప్రవేశపెట్టబడినది......




......కేవలం పేస్టులకే పరిమితమైన అమూల్య ఔషధసమ్మేళనం. పళ్లపొడితో అందజేయటమే మాధ్యేయం.

28,సంవత్సరముల అనుభవం,నేటివినూత్న సృష్టి




'ఏవిటది—చెప్పు'

'నాక్కాస్త డబ్బు కావాలి. చాలా అర్జెంటు, సాధ్యమైనంత త్వరలో తిరిగి ఇచ్చేస్తా' అన్నాడు నేల చూపుల్తో.

'అలాగే—ఎంత కావాలి' అనడిగాను. మా ఇన్నేళ్ళ పరిచయంలో నన్ను డబ్బు లడగటం అదే ప్రథమం ఎంతో అవసరం వుంటేనేగాని అడగడని నాకు తెల్సు.

'అయిదువేలు' అన్నాడు మెల్లగా.

'అయిదువేలా— అయినా అంత డబ్బు నాదగ్గర వుంటుందని ఎలా అనుకున్నావు? సరే— ఎక్కడన్నా ప్రయత్నిస్తాను. అంత అవుసరం ఏవిటో తెల్సుకోవచ్చా?'

'వివరాలడక్కు— కనీసం భూపతిరావునన్నా అడిగిప్పించు. కాని నాకని చెప్పొద్దు. నీకే కావాలని అడుగు. ఒక్క ఏడాది గడువు ఇమ్మను చాలు.'

నే అసహనంగా కదిలాను కూర్చీలో. మనిషి ఔన్నత్యాన్ని అతడి ఆర్థిక పరిస్థితిలో అంచనా కట్టే ధోరణి మనందరిలో చుట్టలు చుట్టకుని నిక్షిప్తంగా వుంటుంది కాబోలు, కాకపోతే నాలో ఇంతకు మునుపు తనధైర్యం, మాటల్లో కరుకుతనం వచ్చిపడ్డాయి.

'చూడు—వాసూ— నువు చెప్పినట్లు భూతపిరావును అడగటానికి నాకేం అభ్యంతరం లేదు. నీమీద నాకు నమ్మకముంది. అదికాదు సమస్య, కాని అంత డబ్బుతో అవసరం రావటానికి కారణం ఏమిటో తెల్సుకోకూడదంటావా? నాక్కూడా చెప్పకూడని రహస్యమా?'

అతడు రెండు క్షణాలు సందేహించి మెల్లిగా అన్నాడు.

'సరే చెపుతా గాని— ఈ విషయం నీలోనే వుంచుకో, ఎవ్వరికి చివరికి నీ భార్యక్కూడా చెప్పకూడదు. అలాగని మాటివ్వు.'

'సరే—అలాగే— ప్రామిస్ చెప్పు.'

వాసు మెల్లిగా చెప్పనారంభించాడు.

'ఈమధ్యనే నాకో వ్యక్తితో పరిచయం ఏర్పడింది. మా కులంవాడే అతడు ఇళ్ళ స్థలాల వ్యాపారంలో వున్నాడు ఇప్పటికే బాగ్గా గడించాడు. నా మీద అభిమానం అను ప్రేమ వాత్సల్యాలను, వాటి మూలకంగా నాకో రెండు స్థలాలు వుచితంగా ఇచ్చాడు. ఇప్పుడా స్థలాల చుట్టూ ముళ్ళకంచె వేయించాలి. లేకపోతే ఎవరన్నా ఆక్రమించేసుకునే ప్రమాదం వుందిట. అదీ అతడే చెప్పాడు— అదీ సంగతి.'

నేను అతడు చెప్పిన విషయం విని స్థాణువైపోయాను. కుర్చీకి అతుక్కుపోయాను. కాస్సేపు నోట్లోంచి మాట వచ్చింది కాదు. తను నమ్మిన సిద్ధాంతం కోసం వుద్యోగాన్ని సంసారాన్ని విసర్జించిన వాసూయేనా మాట్లాడేది అన్పించింది. భూపతిరావు 'పెటీ బూర్జువా' అని విమర్శించిన ఆ వాసేనా అన్పించింది. ఈ దేశంలో ఏ సిద్ధాంతం, ఏ విప్లవం, ఏ వుద్యమం పదికాలాలపాటు బతికి బట్టకట్టక పోవటానికి కారణం' అర్థమైనట్లుగా అన్పించింది.

''సరే రేపే భూపతిరావుని అడిగి చూస్తా. ఇంతకీ ఏడాది తర్వాత ఎలా తీరుద్దామనుకుంటున్నావ్' ఇపుడు నాది కేవలంవ్యాపారధోరణి మాత్రమే.

ఆ ప్రశ్నకి అతడు సమాధానం ముందే సిద్ధం చేసుకున్నట్లుగా— 'ఓ-అదా నీ అనుమానం ఏడాది కాగానే, ఆ రెండిటిలో ఒక స్థలాన్నిఅమ్మిపారేస్తా, ఆ ప్రదేశంలో రేట్లు విపరీతంగా పెరుగుతాయ్—సందేహం లేదు. నీక్కూడా కావాలంటే చెప్పు— అతనితో మాట్లాడి కాస్త తక్కువలో ఇప్పిస్తా!'

'అక్కరలేదు వాసూ అయినా నేనంత గొప్పవాడ్ని కాదుగా. ఇంతకీ మళ్ళీ ఎప్పుడొస్తావ్' కుర్చీలోంచి లేస్తూ అడిగాను.

'రెండ్రోజుల్లో వస్తా. డబ్బు సిద్ధం చేసుంచు ఎలాగైనా సరే.'

'అలాగే ప్రయత్నిస్తాను.'

వాసు సంచిని భుజానికి తగిలించుకుని చీకట్లోకి వెళ్ళిపోయాడు.

రాత్రి నాకు చాలా ఆలస్యంగా నిద్రపట్టింది.

మళ్ళీ కళ్ళు తెరచేసరికి భూపతిరావు దర్శనం ఇచ్చి 'వాసు వచ్చాడటగా' అని అడగటంతో ప్రశాంతమైన ఆలోచన్ల తటాకంలో చిన్న కలకలం అలజడి.

'మీకెలా తెల్సు' అనడిగాను భూపతిరావుని.

'రాత్రి మీ ఇంట్లోనుంచి వెడుతుంటే మా అబ్బాయ్ చూసేట్ట. ఇంతకీ ఎలా వున్నాడు. ఏ వంటాడు. నాగురించి అడిగాడా?' ప్రశ్నల వర్షం కురిపించాడు.

'నా కప్పులోని కాఫీని రెండు గుక్కల్లో తాగేసి—

'ఎలా వున్నాడంటీ చిక్కి శల్యమై పోయాడు. ఏవంటాడంటే షరా మామూలే. విప్లవం పొలిమేరలదాకా పట్టుకొచ్చానంటున్నాడు. ఇహ—మీ గురించి అడిగాడు. అయిదువేలు అప్పుకావాల్ట—మిమ్మల్ని అడగమన్నాడు' అన్నాను. ఖాళీ కప్పు వంక చూస్తూ.

'అయిదువేలా? అప్పా? నా దగ్గిరా? ఎందుకటా?' అయోమయంగా అర్థం కానట్లుగా అడిగాడు.

వాసు చెప్పిన సంగతులన్నీ పూస గుచ్చినట్లుగా ఏదీ దాచకుండా చెప్పేశాను. ఏదీ దాచాలని గాని, దాచాల్సిన ఆవశ్యకత గాని నాకు ఎంతమాత్రం అనిపించింది కాదు.

భూపతిరావు మొహం గంభీరంగా మారింది. కొద్దిక్షణాలు ఏదో తనలో తాను ఆలోచించుకుంటున్నట్లుగా శూన్యంలోకి చూస్తూ గడిపాడు

నేనతన్ని నిశితంగా గమనించసాగాను.

గంభీరంగా మారిన అతడి మొహంలో క్రమక్రమంగా అనుమాన ఛాయలు తప్పకుని ప్రసన్నత కనిపించింది. పెదాలపై సన్నటి చిరునవ్వు తలుక్కున మెరిసింది.

'ఏవిటి నవ్వుతున్నారు—డబ్బులు అడిగినందుకా' అన్నాన్నేను.

అదే చిరుదరహాసంతో అతడు నావంక చూస్తూ—

'అందుక్కాదు—డబ్బుల్దేవుంది. అలాగే ఇస్తా అయిదువేలు ఒకలెక్కా? పాపం—మన వాసు జీవితంలో బాగుపడతానంటే కాదంటామా.'

'మరి ఆనవ్వు దేనికి—నా మొహం చూసా?' కాస్త కోపంగానే అన్నాను.

'ప్రొద్దునే ఎంత సంతోషకరమైన వార్త చెప్పావు. హమ్మయ్య బ్రతికించారు. ఇహ ఈ దేశంలో ఏ విప్లవం రాదు— నాకు ధైర్యం చిక్కింది. ఇవ్వాళ రాత్రికి హాయిగా, నిశ్చింతంగా నిద్రపోతా సర్లేండి—అలా బ్యాంకు దాకా వెళ్ళొస్తా మరి' అంటూ సంతోషంగా, గబగబా వెళ్ళిపోయాడు.

అతని సంతోషాన్ని, సంబరాన్ని చూస్తుంటే నాకు మరింత దిగులుగా అనిపించింది. చీకట్లో కూర్చున్న భావన, సాలోచనగా ఇంగ్లీషు పేపర్ని చేతిలోకి తీసుకున్నాను.

●